# నూతన విద్య పేరుతో కేంద్రప్రభుత్వ గూడు పుఠాణి




కేంద్రంలోని బిజెపి/ఎన్‌డిఏ ప్రభుత్వం గత 6 నెలలుగా విద్యావిధానాన్ని మార్చాలనే ప్రహసనాన్ని కొనసాగిస్తోంది. ఆ మేరకు 'నూతన విద్యా విధానం - 2015' పేరుతో 33 అంశాలతో కూడిన ప్రశ్నావళిని మానవ వనరుల అభివృద్ధి శాఖ వెబ్‌సైట్‌లో ప్రకటించారు. దానిపైన ఎవరైనా తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు ఆన్‌లైన్‌లో యివ్వచ్చని పిలుపు యిచ్చింది. ఆ గడువు ఏప్రిల్ 30తో ముగిసింది. 8300 మంది స్పందించినట్లుగా వెబ్‌సైట్‌లో నమోదైవున్నది గ్రామ విద్యా కమిటీలు, లబ్ధిదారులతో (తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు) సంప్రదింపులు ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించాలని షెడ్యూల్‌లో చెప్పబడింది. అది అమలు జరిగిన దాఖలాలు లేవు. మండల విద్యా కమిటీలు, లబ్ధిదారులతో అభిప్రాయాల సేకరణ జూన్, జులై నెలల్లో పూర్తి కావాలని వుంది. ఇది ఏమవుతుందో తెలియటం లేదు. జిల్లా స్థాయిలో ఆగస్ట్, రాష్ట్రస్థాయిలో సెప్టెంబర్, జాతీయ స్థాయిలో డిసెంబర్‌లో సంప్రదింపుల ప్రక్రియను నిర్వహించాలని చెప్పారు. ఈ మొత్తం ప్రక్రియలో వచ్చిన సమాచారం ఆధారంగా ఒక ముసాయిదా నివేదికను రూపొందించి ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదించటం జరుగుతుందని విద్యాశాఖ చెబుతోంది. మరోవైపు నిపుణుల పేరుతో ఎంఎల్‌సీలు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు, స్వచ్ఛందసంస్థలు, విద్యార్థుల ప్రతినిధులతో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించారు. అలాంటివి రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా నిర్వహించబడినవి. ఇదంతా చూస్తుంటే చాలా విస్తృతంగా అందరితో సంప్రదించుతున్నట్లే అనిపిస్తుంది. కానీ, ఏ విషయాలు గురించి ఏమి అభిప్రాయాలు సేకరిస్తున్నారనేదీ అనుమానంగా, ఆందోళనకరంగా వుంటుంది.

పాఠశాల విద్యకి సంబంధించి 13 అంశాలపైన, ఉన్నత విద్యకు 20 అంశాలపైన అభిప్రాయాలు అడిగారు. ఒక్కో అంశానికి కొంత వివరణ యిచ్చి కొన్ని ప్రశ్నలు వేశారు. వాటికి జవాబులు చెప్పాలి. అన్ని ప్రశ్నలనూ పరిశీలించి చూస్తే సారాంశంలో నాలుగు విషయాలు తెలుతున్నాయి. ఒకటి, ప్రస్తుత విద్యావిధానం సంతృప్తికరంగా లేదు, అందుకు ఉపాధ్యాయులే బాధ్యులు. రెండు, ప్రైవేట్ రంగం ఫర్వాలేదు. మూడు, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యమే పరిష్కార మార్గం. నాలుగు, స్వయం ఉపాధికి తోడ్పడేందుకు వృత్తివిద్యలు నేర్పాలి. కొన్ని ప్రశ్నలు సమస్యల పట్ల అసహనాన్ని, వైరాగ్యాన్ని వ్యక్తీకరించే విధంగా వున్నాయి. నిర్మాణాత్మక సూచనలు, సలహాలు యివ్వటానికి అనువుగా ఏ ఒక్క ప్రశ్నా వుండదు.

విద్యార్థులకు కనీస సామర్థ్యాలు లేకపోవటానికి కారణం ఏమిటి? అనే ప్రశ్నకు తల్లిదండ్రులు, ప్రజలు ఉపాధ్యాయులే అని చెప్పవచ్చు. వారికి యితర కారణాలు అంతగా తెలియకపోవచ్చు. టీచర్లు స్కూల్లో ఎంతవరకు వుంటున్నారో కనిపెట్టటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలా? 1,2 తరగతులకు అంకితభావంగల ఉపాధ్యాయులు కావాలా? ఈ ప్రశ్నల ఉద్దేశం ఉపాధ్యాయులను బోనులో నిలబెట్టేందుకే. విద్యారంగంలో బిజెపి ప్రణాళికను అమలు చేయటానికి ఇప్పటి ఉపాధ్యాయులు పనికిరారని, వేదకాలం నాటి గురువులు కావాలని కేంద్రవిద్యామంత్రి స్మృతిఇరానీ గత ఏడాది ఆగస్ట్ 23న హైదరాబాద్‌లోనే ప్రకటించారు కదా. ప్రీప్రైమరీ స్కూల్ పరిశ్రమ పెద్దఎత్తున విస్తరించటానికి కారణం ఏమైవుంటుంది? అని అడుగుతున్నారు. విద్యాహక్కుచట్టం సెక్షన్ 11లో పూర్వప్రాథమిక విద్య ప్రాధాన్యతను చెప్పిన విషయాన్ని ప్రభుత్వమే గుర్తుచేసుకోవాలి. విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని ఏ విషయాల్లో వినియోగించాలో చూడాలని కూడా అడుగుతున్నారు.

సెకండరీ విద్యలో నెలకొన్న అసమానతలు (ప్రాంతీయంగా, సామాజికపరంగా) తొలగించటానికే రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ), కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు ఇటీవల కాలంలోనే అమల్లోకి వచ్చాయి. అవి యింకా ఆరంభ సమస్యలతోనే తడబడుతున్నాయి. వాటిని వదిలేసి యింకేమి చేయాలో చెప్పండని బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) మోడల్‌తో ఈ సమస్యను అధిగమించవచ్చా అంటూ అమాయకంగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పిపిపి (పాఠ్యపుస్తకాల ప్రచురణ, భవనాల నిర్మాణం, కంప్యూటర్‌విద్య, మధ్యాహ్న భోజనం వగైరా) అమల్లో వుందిగా. పాఠశాల పరిపాలన కూడా ప్రైవేట్ వారికే అప్పగించాలనే కేంద్రప్రభుత్వ కోరిక తీర్చుకోవటానికే ఈ డొంక తిరుగుడు వ్యవహారం. 'వృత్తివిద్యను బలోపేతం చేయాలి' అనే థీమ్‌లో నైపుణ్యాధారిత విద్య విద్యార్థుల ఉపాధి అవకాశాలకు ఉపయోగపడుతుందా? అనేది ప్రశ్న. అంటే పాఠశాల విద్యతోనే ఉపాధి చూసుకోవాలని, ఉన్నత విద్యలకి పోలేకపోయినా పర్వాలేదని చెప్పటమే. దాని వెనకే మరోప్రశ్న మేన్యుఫ్యాక్చరింగ్ కంటే సర్వీస్ సెక్టార్ కోర్సులనే ప్రవేశపెట్టాలి కదా? అని అంటున్నారు. సేవలు చేసుకుని బ్రతకాల్సిందే తప్ప ఉత్పత్తిలో పాల్గొనాల్సిన అవసరం లేదని చెప్పటమే.

పరీక్షలు సంస్కరణల్లో భాగంగా నిరంతర సమగ్ర మూల్యాంకన (సిసిఇ) విధాన అనుభవం ఎలావుంది? 'నో డిటెన్షన్' పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలు ఎలా వున్నాయి? ఈ విధానాన్ని ఎత్తేసే ఎత్తుగడతో ఇప్పటికే కేంద్రవిద్యాశాఖ రంగం సిద్ధం చేసుకున్నది మార్చి26న న ఢిల్లీలో జరిగిన రాష్ట్రాల విద్యాశాఖ మంత్రుల సమావేశంలో కొన్ని రాష్ట్రాల వారితో డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలనే డిమాండ్‌ని చెప్పించారు. ఏప్రిల్ 27న లోక్‌సభలో స్మృతి ఇరానీ ఒక ప్రశ్నకు జవాబుచెబుతూ నో డిటెన్షన్ విధానంపైన సిబిఎస్ఇ యిచ్చిన నివేదిక పరిశీలనలో వున్నట్లు చెప్పారు. నాన్ డిటెన్షన్ విధానంలో యిమిడి వున్న రెండు ముఖ్యమైన విషయాల పట్ల ప్రభుత్వ వైఖరి వెల్లడించాలి. ఒకటి, ఒక విద్యా సంవత్సరంలో నిర్ణయించిన చదువు రాకపోవటానికి లోపం ఎవరిది? పాఠ్యాంశాలను రూపొందించిన ఎన్‌సిఇఆర్‌టి/ఎస్ఇఆర్‌టి బోధించిన ఉపాధ్యాయులదా? నేర్చుకున్న విద్యార్థులదా? అసలు లోపాన్ని దిద్దుబాటు చేయకుండా విద్యార్థులనే

బలిపశువులను చేయటం ఏమి న్యాయం. రెండు, నోడిటెన్షన్‌కి మంగళం పాడి డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తే దాని ప్రభావం ఎలా వుంటుంది. ఆ విధానాన్ని ప్రైవేట్ స్కూళ్లు అమలు చేయవు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయకతప్పదు. డిటెన్షన్‌కి గురైన విద్యార్థులు యింకో సంవత్సరం అదే తరగతిలో వుండాలంటే న్యూనతకు గురయి, మానసికంగా కృంగిపోతారు. వారి తల్లిదండ్రులు కూడా అసహనానికి గురై బడి మాన్పించి ఏదో ఒకపనిలో పెడతారు. బలవంతంగా బాలకార్మికులు అవుతారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారిలో అత్యధికులు అణగారిన, బలహీన తరగతులవారే. అందువలన డిటెన్షన్ విధానానికి బలయ్యేది దళితులు, గిరిజనులు, మైనారిటీలు, బీసీలే.

పాఠశాలవిద్యలో భాషల విధానంపట్ల కూడా కేంద్రానిది దోబూచులాటే! మీ పిల్లలు ఏ భాషలు నేర్చుకోవాలని కోరుకుంటున్నారు. 'ఇంగ్లీష్-హిందీ-స్థానికభాష' వీటిలో ఏది? అని తల్లిదండ్రుల్ని అడుగుతున్నారు. విద్యాబోధన ఏ భాషలో వుండాలో చెప్పండని కూడా కోరుతున్నారు. తల్లిదండ్రులు, వ్యక్తులు ఏం కోరుకున్నా తీర్చాలనేది ప్రభుత్వ ధ్యేయమా? త్రిభాషా విధానానికి తిలోదకాలు యివ్వదల్చుకున్నదా? మాతృభాషలో విద్యాబోధనకు మంగళం పాడదల్చుకుందా? స్థానిక భాషలను నిర్లక్ష్యం చేస్తే విద్యకి మేలు జరుగుతుందా? అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యాబోధన విదేశీభాషల్లోనే వుందా? విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచటానికి కరిక్యులమ్, సిలబస్‌లో చేయాల్సిన మార్పులను సూచించమని కూడా కోరుతున్నారు. ఎన్‌డిఏ-1 (1998-2004) హయాంలో విద్యారంగంలో పొడచూపిన కాషాయీకరణ చర్యలకు వ్యతిరేకంగా పెల్లుబికిన ఆందోళనల నేపథ్యంలో రూపొందిన 'నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ 2005' సరిపోదా? ఇక, పాఠశాలల నిర్వహణకి సంబంధించిన ప్రశ్నల్లో ఎస్ఎంసిల పని విధానాన్ని మెరుగుపర్చే ఉద్దేశం లేకపోగా సమాజ భాగస్వామ్యం పేరుతో గ్రామపంచాయితీలకు అధికారాలు యివ్వాలనే ప్రతిపాదనలు కనిపిస్తున్నాయి. ఇలాంటి అనేక ప్రశ్నలు 13 అంశాల్లో ఇబ్బడి ముబ్బడిగా వున్నాయి. వాటిలోని అంతస్సారాన్ని పరిశీలించితే నర్మగర్భితంగా కొన్ని విషయాలు ద్యోతకమవుతున్నాయి. అవి, 1. ప్రభుత్వ పాఠశాలల పట్ల అసంతృప్తి, 2. ఉపాధ్యాయులనే దోషులుగా చూపటం, 3.ప్రైవేటీకరణే పరిష్కారం. 4. అంతర్జాతీయ భాగస్వామ్యం అనివార్యం, 5. డిటెన్షన్ విధానాన్ని పునరుద్ధరించటం, 6. విదేశీ భాషలను ఆశ్రయించటం, 7. కరిక్యులమ్, సిలబస్‌ని మార్చటం. వీటిని యింకా నిర్దష్టంగా చెప్పాలంటే ప్రభుత్వం విద్యారంగం నుండి తప్పుకుని ప్రైవేట్ కార్పోరేట్ విదేశీ సంస్థలకు వదిలేయటం, వారికి అవసరమైన విద్యార్థులనే తయారుచేయటం, కరిక్యులమ్ సిలబస్‌లో మాత్రం ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అమలు చేసుకోవటం.

నూతన విద్యావిధానం-2015 పేరుతో చేస్తున్న ప్రక్రియ ప్రజలను మభ్యపెట్టటానికే. మరోవైపు ప్రభుత్వం తాను చేయదల్చుకున్న స్వామికార్యం చేసుకుపోతూనే వున్నది. వచ్చే విద్యాసంవత్సరం నుండి కేంద్రీయ విద్యాలయాలు, బిజెపి పాలిత రాష్ట్రాల్లో సంస్కృతభాషని కంపల్సరీ సబ్జెక్ట్‌గా చేస్తున్నారు. తేజోమయ భారతి పేరుతో దీనానాథ్ బాత్రా (ఆర్ఎస్ఎస్ అనుబంధ శిక్షా సంస్కృతి ఉత్థాన్ న్యాస్ అధినేత) పాఠాలను కొన్ని రాష్ట్రాల్లో బోధిస్తోంది. భగవద్గీత, మహాభారతం, రామాయణ పాఠాలు తయారు చేస్తున్నారు. యిప్పటికే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో అమలవుతున్న సూర్యనమస్కారాలు, యోగాసనాలను అన్ని రాష్ట్రాల్లోనూ పాటించాలంటున్నారు. మధ్యప్రదేశ్‌లో బడిపిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు వద్దని నిషేధించారు. శాకాహారం మాత్రమే తినాలని శాసిస్తున్నారు. మహారాష్ట్రలో మదరసాలకు ప్రభుత్వ గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఐఐటిలు, విశ్వవిద్యాలయాల్లోని కీలక స్థానాల్లో ఆర్ఎస్ఎస్ వారిని నియమిస్తున్నారు. ఉన్నత స్థానాల్లో వున్న సెక్యులర్ స్వభావంగల వారిని తొలగిస్తున్నారు. అందుకు నిరసనగా నలందా విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవి నుండి సుప్రసిద్ధ ఆర్థికవేత్త అమర్త్యసేన్, ఐఐటి బొంబాయి చైర్మన్ పదవి నుండి ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త అనిల్‌కాకోద్కర్ తప్పుకున్నారు. ఇలాంటి విషయాలతోనే నూతన విద్యావిధానాన్ని ప్రకటించాలనే పట్టుదలతో బిజెపి ప్రభుత్వం తెరవెనుక సన్నాహాలు చకచకా చేసుకుపోతున్నది.

చర్యకు ప్రతిచర్య సహజం. విద్యారంగంలో బిజెపి/ఆర్ఎస్ఎస్ చేస్తున్న నియంతృత్వ చర్యలకు ప్రతిఘటన వస్తున్న సందర్భాలు కూడా వున్నాయి. గత ఏడాది గుడ్ గవర్నెన్స్‌డే పేరుతో క్రిస్టమస్ రోజున సెలవుదినాన్ని ఎత్తేసేందుకు ఎంహెచ్ఆర్‌డి యిచ్చిన సర్క్యులర్‌పై పార్లమెంట్‌లో అన్ని పార్టీలూ ఆందోళన వ్యక్తం చేశాయి. దానితో ప్రభుత్వం వెనకడుగువేసింది. మద్రాస్ ఐఐటిలోని అంబేద్కర్ పెరియార్ స్టడీ సర్కిల్‌ని నిషేధించినపుడు విద్యార్థులు నిరసన ఉద్యమం చేశారు. వారికి అనేకమంది మేధావులు, విద్యావేత్తలు మద్దతు ప్రకటించారు. దానితో నిషేధాన్ని ఉపసంహరించారు. ఫిలిం & టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (FTII) ఛైర్మన్‌గా అందుకు తగిన అర్హతలు లేని ఆర్ఎస్ఎస్ కార్యకర్త గజేంద్రచౌహాన్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ ఆ సంస్థ విద్యార్థులు నిరసన పోరాటం చేస్తున్నారు. భారతదేశ చిత్రపరిశ్రమలోని అత్యంత ప్రముఖులు (అదూర్ గోపాలకృష్ణ, రిషీకపూర్, మృణాల్‌సేన్, గిరీష్ కర్నాడ్ తదితరులు) ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతూ విద్యార్థుల పోరాటాన్ని బలపరుస్తున్నారు. ఇలాంటి ప్రతిఘటనా చర్యలు ఉన్నత, సాంకేతిక విద్యాసంస్థల్లో చెదురుమదురుగా జరుగుతున్నాయి. పాఠశాల స్థాయిలో విద్యార్థుల నుండి (చిన్నవారుగనుక) ఆపాటి నిరసన కార్యక్రమాలు అంతగా కనిపించటం లేదు. కనుక ఈ విషయంలో పెద్దలే జోక్యం చేసుకోవాలి.

దేశంలో విద్యావేత్తలు, మేధావులు, విద్యారంగంలో నిపుణులు ఎంతోమంది వున్నారు. వారితో కేంద్రవిద్యాశాఖ చర్చలు జరపటం లేదు. గతంలో 1968 కొఠారీ కమీషన్ నివేదిక, 1986 విద్యావిధానం సందర్భాల్లో అలాంటి వారితో విస్తృతమైన చర్చలు జరిగాయి. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం హిందుత్వ విద్యావేత్తలతోనే రహస్యమంతనాలు జరుపుతున్నారు. ఈ నెల 18న ఆర్ఎస్ఎస్ సమావేశంలో కేంద్ర విద్యామంత్రి స్మృతిఇరానీకి దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. ఈ విధంగా మతోన్మాద సిద్ధాంతంతో నూతన విద్యా విధానం - 2015 రూపకల్పనకు రంగం సిద్ధమవుతోంది. ఇది స్వతంత్ర భారతదేశంలో విద్యారంగానికి ఎదురవుతున్న అతిపెద్ద సవాల్. దీనిని ఎదుర్కోవటానికి విద్యారంగ శ్రేయోభిలాషులు, ప్రజాతంత్రవాదులు వెంటనే స్పందించకపోతే దేశం మధ్యయుగాల వైపు తిరోగమించే ప్రమాదం దాపురిస్తుంది. ☯